పేటకు అరగంటలో వెళ్ళి, భర్తవున్న యింటి తలుపు కొట్టింది. లోపల్నుంచి "తలుపు తీసేవుంది" అని కేక వినపడగానే, గబగబా లోపలికి వెళ్ళింది.

వసారాలో చాపమీద శవం—ఆ శవం ప్రక్కనే, తలవంచుకొని దుఃఖిస్తూ తన భర్తా—మండువా దగ్గర దిగాలుపడి కూచుని బిం్రోతూ కనపడ్డారు.

భర్త తలయెత్తి తనవంక చూసి, "నువ్వా!" అని వ్రేలితో శవాన్ని చూపించాడు.

ఆ శవం ఎవరో అని కనకం దగ్గరకు వెళ్ళింది.

నిన్నరాత్రి తన దగ్గరకు వచ్చినప్పుడు ఎలా వుందో అలాగే వుంది. విషం తాగింది కాబోసు!

"అయ్యో! ఇంతపని చేస్తుందనుకోలేదు. నిన్నరాత్రి పన్నెండింటికి వచ్చి, నన్ను వెంటనే మీ దగ్గరికి రమ్మని బ్రతిమాలింది!" అని కనకం అంటూండగానే, ఆమె భర్తలేచి "పన్నెండు గంటలకా! సరిగ్గా ఆ సమయానికే దాని ప్రాణాలు పోయాయి. సరిగ్గా పన్నెండింటికే!" అన్నాడు.

"నిజమే!" అంటూ విస్తుపోయింది కనకం. కాని రెండు నిమిషాలలో ఆమెకు ఏమర్థమయిందో; "ఎంత ప్రేమగలదానివే, లక్ష్మీ!" అంటూ ఆ శవాన్ని కౌగిలించుకొని విలపించింది.

———

# 8. వంట మనిషి పోలికలు

"మీరు నన్ను ఎందుకు పనిలోనుంచి తీసివేస్తున్నారో నాకు తెలుసు, అంతమాత్రం తెలియకపోలేదు లెండి" అని, సామానంతా సర్దుకొని ఇల్లు బయలుదేరి వెళ్ళిపోతూవున్న వంటలక్క అంది.

డిప్యూటీ కలెక్టరుగారి భార్య, 'తెలిస్తే తెలిసిందిలే' అన్నట్టూ, 'ఆ తెలియడం మంచిదే' అన్నట్టూ మొహం పెట్టి, వంటలక్క మాటల్ని నిర్లక్ష్యంగా త్రోసివేసి, "నీకూ నాకే గాకుండా ప్రపంచమందరికీ కూడా తెలిస్తే మంచిది" అంది.

వంటలక్క చిరునవ్వు నవ్వింది. డిప్యూటీ కలెక్టరుగారి భార్యకు వొళ్ళు మండింది. కాని, తన భర్తమీద అధికారం చెలాయించి ఈ వంటలక్కను పనిలోనుంచి తీసివేయించ గలిగాను గదా అనే గర్వంతోనూ, ఏదో పెద్ద పగ తీర్చుకుంటున్నాననే తృప్తితోనూ, ఆమె హృదయంలో హాయిగానే వుందికాని, తన అధికారం వల్ల, ఉద్యోగంలోనుంచి తాను తీసివేయించిన వంటలక్క తన కాళ్ళమీద పడి తాను చేసిన తప్పుల్ని క్షమించమని వేడకుండా, తనకు ఎక్కడా ఉద్యోగం దొరకదేమో- తన బ్రతుకు ఎలాగో అని విలపించకుండా, సామాను సర్దుకొని వెళ్ళిపోతూకూడా తనను ధిక్కరించడము, డిప్యూటీ కలెక్టరుగారి భార్యకు కొంచెం కోప కారణమే అయింది.

అసలు ఈ వంటలక్కను కోరి తమ యింట్లో చేర్పించిన ఆవిడ, డిప్యూటీ కలెక్టరుగారి భార్యే! ఆ వంటలక్క వచ్చిన తరువాత ఏ వారంరోజులు ఆమె బాగా వుందోకాని, ఆ తరువాత మాటిమాటికీ వంటలక్క మీద తప్పులు పెడుతూనే వుండేది. డిప్యూటీ కలెక్టరుగారికి యిదంతా అయోమయంగా వుండేది.

"ఆ ముండని పెట్టిందాకా నా ప్రాణం తీశావు. ఇప్పుడు ఇలా దాన్ని వేపుకు తింటున్నావేమిటి?" అని అడిగేవాడు. కాని నలభయ్యోయేట రెండోపెళ్ళి చేసుకొన్నందువల్ల ఆయన భార్యకు పూర్తిగా లోకువ అయిపోయాడు.

"చాల్లెస్తురూ, దానిపక్షాన మాట్లాడుతారేమిటి మీరు? అయినా నేను మొదటినుంచీ గ్రహిస్తూనే వున్నాను, దాని ధోరణీ, మీ ధోరణీ" అని గదమాయించేది ఆయనను....ఇరవైమూడేళ్ల భార్యా యాభైయేళ్ళ భర్తా అవడంలో, భార్య రెండోపెళ్ళి భార్య అవడంలో ఆయన సహజంగానే ఆమె అంటే మరీ ప్రాణం విడుస్తూవుండేవాడు. ఆయన ప్రేమ ఎక్కువగా చూపిన కొద్దీ, ఆమె ఆయనమీద అధికారం కొద్ది

కొద్దిగా చెలాయించడం మొదలుపెట్టింది. కొన్నాళ్ళయాక యింట్లో అధికారం కేవలమూ అమ్మగారిదీ, బయట మునసబు కరణాలు తాసిల్దార్లు, రెవిన్యూ ఇనస్పెక్టరులూ మొదలైన ఉద్యోగి బృందంమీద అధికారం అయ్యగారిదీ అయింది.

డిప్యూటీ కలెక్టరుగారికి మొదట్లో ఒక వంటవాడు వుండేవాడు. మొదటి భార్య బ్రతికివున్నప్పుడు ఆమె చేసేది వంట. ఆమె చనిపోయిన తరువాత ఒక వంటవాణ్ణి పెట్టుకున్నాడు. రెండో పెళ్ళి చేసుకోవడమూ, ఈమె కాపురానికి రావడమూ ఆ వంటవాడి హయాములోనే జరిగాయి. ఈమె కాపురానికి వచ్చిన తరువాత నెలరోజులో రెండునెలలో మాత్రమే ఆ వంటవాడు ఆ యింట్లో ఉన్నాడు. తరువాత డిప్యూటీ కలెక్టరుగారే ఆ వంటవాణ్ణి పిలిచి, వాడికి యివ్వాలిసిన జీతమూ, ఇంకా పదిరూపాయలూ యిచ్చి యింక పనిమానుకో మని చెప్పి పంపివేశారు.

భార్య తనకు వంట చేతగాదనీ, వంటవాడు ఉండవలసిందేననీ కోరిందిగాని, ఆడదాన్ని పెట్టుకుందాము అని ఆమెకు సమాధానం చెప్పాడు.

మొదటి భార్యకు ఒకే కూతురు పుట్టి ఎనిమిదేళ్ళు పెరిగి చచ్చిపోయింది. ఇక, డిప్యూటీ కలెక్టరుగారికి మళ్ళీ పిల్లలు కలగలేదు. రెండోపెళ్ళిచేసుకోవడంలో సంతానవాంఛకూడా ఒక కారణమే. మొదట వంటవాణ్ణి తీసివేసిన తరువాత పదిరోజులదాకా భార్యచేతనే వండించాడు. ఆ తరువాత తన అత్తగారికి ఉత్తరం వ్రాయించి, పిలిపించి, కూతురు దగ్గర వుండమని ఆమెనుకోరి తమ యింట్లో నిలిపివేశాడు. ఆమెకూడా, తాను వితంతువు కనుకనూ, తన కోడలికీ తనకూ అంత అన్యోన్యం లేకపోవడము చేతనూ, కూతురిగారి ఇంట్లో గౌరవంగా జరగటం చేతనూ, కూతురిగారి ఇంట్లో ఉండటానికి ఇష్టపడింది. ఆ పట్టున ఆవిడ ఎనిమిది సంవత్సరాలు కూతురిగారి యింట్లో వుంది. ఆ తరువాత జబ్బుచేసి చనిపోయింది.

తల్లి చనిపోయిన తరువాత రెండుమూడు నెలలు తనకుతానే వండుకొంది కాని, ఆ తరువాత వంటలక్కను పెట్టవలసిందని డిప్యూటీ

కలెక్టరుగారి భార్య భర్తను చాలా బలవంత పెట్టింది. ఆయనకూడా వంటలక్కల కోసం వెతికించాడు.

డిప్యూటీ కలెక్టరు వెతికిస్తే వంటలక్కలకు ఏం తక్కువ? ఇద్దరు ముగ్గురు వచ్చారు. వాళ్ళు నచ్చలేదు. ఆ తరువాత ఈ వంట లక్క వచ్చింది. ఆమెను చూడగానే డిప్యూటీ కలెక్టరుగారు, ఆమె అడిగిన ప్రకారం, భోజనంపెట్టి నెలకు పాతిక రూపాయలు యిచ్చే పద్ధతిని కుదిర్చేసుకున్నాడు. ఆ తరువాత ఎంతోమంది వచ్చారు. వాళ్ళందరిని పొమ్మన్నాడు.

ఈ వంటలక్క చాలా అందమైన మనిషి. పాతికేళ్ల వయస్సులో ఉంది. చిన్నప్పుడే భర్త పోయాడట. రెండు సంవత్సరాలనాడు తల్లి చచ్చి పోయిందాకా పుట్టింటిలోనే ఉన్నదటకాని, ఆ తరువాత తనకూ వదినెగార్లకూ పడక ఎక్కడేనా కష్టపడి పని చేసుకుందామని ఈ వృత్తిలోకి దిగిందట.

పనిలో చేరిన తరవాత వారంరోజులు వీళ్లు అన్యోన్యంగా ఉన్నారు. అక్కడనుంచి యిద్దరికీ మనస్పర్థలు ఆరంభమయాయి. డిప్యూటీ కలెక్టరుగారి భార్య కోపపడినప్పుడు, వంటలక్క ఎదురుసమాధానం చెప్పేది. ఇదంతా ఇరుగుపొరుగువాళ్లకి విచిత్రంగా ఉండేది. ఇరుగుపొరుగు వాళ్ళు 'ఏమిటమ్మా మీ వంటలక్క ధోరణి' అని అడిగితే, 'నా కాపురం పాడుచెయ్యడానికి వచ్చింది,' అని చెప్పేది. భర్తతో పోట్లాడి వంటలక్కను పని మానివెయ్యమని చెప్పింది.

తన సామాను సర్దుకొని వంటలక్క వెళ్లేసమయానికి, ఆమె కెదురు నిలచుంది, 'చూశావా నా తడాఖా' అన్నట్టు, వంటలక్క కేసి చూస్తూనూ. ఈ దృశ్యం చూడటానికి ప్రక్కయింటివారి వెధవాడబడుచుకూడా అక్కడికి వచ్చింది. డిప్యూటీ కలెక్టరుగారు ఆఫీసుగదిలో కూర్చుని వ్రాసుకుంటున్నారు.

"అయితే చెప్పమన్నారా, నన్ను ఎందుకు తీసేస్తున్నారో పనిలోనుంచి?" అని అడిగింది వంటలక్క.

"చెప్పు! ప్రతివారికీ చెప్పుకో, ఎక్కడా ఉద్యోగం దొరకకుండా పోతుంది" అంది డిప్యూటీ కలెక్టరుగారి భార్య.

"నేను మీకన్న చాలా చక్కనిదాన్ని కనుక—" అంది వంటలక్క.

"మా ఆయన చెప్పారా ఏమిటి?" అంది డిప్యూటీ కలెక్టరుగారి భార్య.

"మిమ్మల్నీ, నన్నూ చూసిన ప్రతివాళ్లూ అనుకుంటున్నారు" అని చెప్పింది వంటలక్క.

"ఉహూఁ" అన్నది కలెక్టరుగారి ఇల్లాలు.

"ఇంకో కారణం ఏమిటంటే, నేను మీకన్న మర్యాద బాగా చేస్తానట" అంది వంటావిడ.

"ఈ మాట మా ఆయనే చెప్పారా?" అని అడిగింది యింటావిడ.

"అబ్బే! మీ యింటికి వచ్చిన ప్రతివారూ చెప్పారు" అని చెప్పింది వంటమనిషి.

"ఉహూఁ" అంది కలెక్టరుగారి గృహిణి.

"ముఖ్యమైన మూడో కారణం ఏమిటో చెప్పనా? నేను మీ కంటె బాగా ప్రేమిస్తానుట. మీకన్న ఎక్కువగా సుఖ పెడతానుట" అని గట్టిగా అంది వంటలక్క.

"ఈ మాట తప్పకుండా మా ఆయన చెప్పివుంటారు" అని ఏదో జయం పొందినట్టుగా వంటలక్కకేసి చూసింది కలెక్టరు భార్య.

"ఆయనకాదు పాపం! మీ మోటారు డ్రైవరు చెప్పాడు నాకు" అంటూ వీధిలోకి నడిచింది వంటావిడ.

కలెక్టరుగారి యిల్లాలు దిమ్మరపోయింది.

———

## 9. పెంపుడు కొడుకు

పది సంవత్సరాలకు పూర్వం భార్య చనిపోయినప్పటినుంచీ చిదంబర శాస్త్రి తన కొడుకు శంకరయ్యని యెంతో జాగ్రత్తగా, అల్లారు